ప్రజాశక్తి
ఆదివారం 6 ఏప్రిల్ 2025
5
పార్వతీపురం మన్యం

రేపు ఎంఎస్ఎంఇ మంత్రి కొండపల్లి రాక

ప్రజాశక్తి - పార్వతీపురం

రాష్ట్ర చిన్న, సూక్ష్మ, మధ్య తరహా పరిశ్రమలు, పేదరిక నిర్మూలన, ఎన్ఆర్ఐ సాధికారత, సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఈనెల 7న (సోమవారం) జిల్లాకు వస్తున్నారని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. మంత్రి సోమవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్షిస్తారని చెప్పారు. ఈ మేరకు సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ టెలీ కాన్ఫరెన్స్ ను శనివారం నిర్వహించి సమావేశానికి అవసరమగు ఏర్పాట్లు చేయాలని, సంబంధిత పూర్తి సమాచారంతో హజరు కావాలని ఆయన ఆదేశించారు.

బెడిసి కొట్టిన టిడిపి వ్యూహం

- అవిశ్వాసానికి వెనక్కి తగ్గేనా?
- 18మంది కౌన్సిలర్ల సంతకాలతో నోటీసు అందజేత
- చెల్లుబాటు కాదనే వాదనలు
- క్యాంపులో వైసిపి కౌన్సిలర్లు

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లా కేంద్ర మున్సిపాలిటీలో తెరపైకి వచ్చిన అవిశ్వాస సినిమా హిట్టా ఫట్టా అనే చర్చ సాగుతోంది. ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర నాయకత్వంలో టిడిపి కౌన్సిలర్లు మున్సిపల్ ఛైర్‌పర్సన్ బోను గౌరీశ్వరిపై గత నెల 24న అవిశ్వాస తీర్మానం ప్రతిపాదిస్తూ జిల్లా జాయింట్ కలెక్టర్ శోభికకు నోటీసు అందజేశారు.18 మంది కౌన్సిలర్లతో ఆదరాబాదరాగా నోటీసు అందజేశారనే అభిప్రాయం అప్పుడే వ్యక్తమైంది. మున్సిపల్ ప్రాతినిధ్య చట్టంలోని నిబంధనల ప్రకారం అవిశ్వాస తీర్మానం ప్రతిపాదించడానికి మొత్తం కౌన్సిలర్లల్లో 2/3 వంతు కౌన్సిలర్లు నోటీసుపై సంతకాలు చేయాల్సి ఉంటుంది. అంటే పార్వతీపురం మున్సిపాలిటీలో ఉన్న 30 మంది కౌన్సిలర్లలో 20 మంది విధిగా అవిశ్వాస తీర్మానం నోటీసుపై సంతకాలు చేయాలనే నిబంధనలు సూచిస్తున్నాయి. కానీ 18 మంది కౌన్సిలర్లతో అవిశ్వాస తీర్మానం నోటీసు అందజేయడం ప్రశ్నార్థకమైంది. వైసిపి నుంచి టిడిపిలోకి చేరిన 10 మంది కౌన్సిలర్లు, 8మంది టిడిపి కౌన్సిలర్లు కలిపి నోటీసుపై సంతకాలు చేశారు. ఇక్కడే టిడిపి నాయకులు పప్పులో కాలేసినట్లు స్పష్టంగా కనిపిస్తోంది. మున్సిపల్ నిబంధనల ప్రకారం అవిశ్వాస తీర్మానం నోటీసు ఇవ్వాలంటే ఎంతమంది కౌన్సిలర్ల సంతకాలు వుండాలనే ప్రాథమిక సూత్రం నాయకులకు తెలియకపోవడంతో అది చెల్లుబాటు కాని పరిస్థితి ఏర్పడింది. అతి విశ్వాసంతో ముందుకెళ్లి తెరమీదకు తెచ్చిన అవిశ్వాస తీర్మానం సినిమా రిలీజైన రోజే ప్లాపయినట్లు కనిపిస్తోంది. టిడిపి లేవనెత్తిన అవిశ్వాస తీర్మానం నోటీసు చెల్లుబాటు కాదనే అభిప్రాయంతో జెసి తదుపరి ప్రక్రియను ముందుకు తీసుకెళ్లలేదనే వాదనలు వినిపిస్తున్నాయి. ఒకవేళ అవిశ్వాస తీర్మానం నోటీసు కరెక్ట్‌గా ఉంటే ఇప్పటికే ప్రతిపాదించిన కౌన్సిలర్లందరికీ నోటీసులు జారీ చేయాల్సి ఉంది. నోటీసులో సంతకాలు చేసిన కౌన్సిలర్ల సంతకాలు సరిపోల్చడం, వారి అభిప్రాయాలను తెలుసుకోవడం వంటి ప్రక్రియను అధికారులు చేపట్టే అవకాశం ఉంది. 15రోజుల్లోగా అవిశ్వాస తీర్మానం నోటీసుపై సంతకాలు చేసిన కౌన్సిలర్లకు అధికారులు నోటీసులు జారీ చేయాల్సి ఉంటుంది. అదేదీ ఇక్కడ జరగలేదంటే అవిశ్వాస తీర్మానం సినిమా ఆదిలోనే అట్టర్ ఫ్లాప్ అయిందనే ప్రచారం జరుగుతోంది.

జెసికి అవిశ్వాస తీర్మానాన్ని అందజేస్తున్న టిడిపి కౌన్సిలర్లు (ఫైల్)

అనుభవరాహిత్యంతో వ్యూహం బెడిసి కొట్టిందా?

మున్సిపాలిటీలో ఛైర్‌పర్సన్ బోను గౌరీశ్వరిపై టిడిపి ప్రతిపాదించిన అవిశ్వాస తీర్మానం ఎపిసోడ్‌లో స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అనుభవరాహిత్యం స్పష్టమయిందనే వాదనలు వినిపిస్తున్నాయి. ఆయన మొదటి సారి ఎమ్మెల్యే కావడంతో మున్సిపల్ ప్రాతినిధ్య చట్టం నిబంధనలపై అవగాహన లేకపోయి వుండొచ్చు. కానీ టిడిపి కౌన్సిలర్లు, వైసిపి నుంచి టిడిపిలో చేరిన కౌన్సిలర్లలో చాలా మంది సీనియర్లు ఉన్నారు. ఛైర్‌పర్సన్ సీటు ఆశిస్తున్న సీనియర్ నాయకులు కూడా టిడిపిలో ఉన్నారు. వారికైనా మున్సిపల్ ప్రజా ప్రాతినిధ్య చట్టంలోని నిబంధనల గురించి అవగాహన వుండి తీరాలి. ఏడాది ఛైర్‌పర్సన్ పదవి కోసం అవిశ్వాస తీర్మానం ప్రతిపాదించడం వెనుక టిడిపి అధికారంలో ఉందనే భావంతోనే నాయకులు ముందుకెళ్లి చతికిల పడ్డారు. కానీ వ్యూహాత్మకంగా అడుగులు వేయలేకపోయారనే వాదనలు వినిపిస్తున్నాయి.

క్యాంపులో వైసిపి కౌన్సిలర్లు

మున్సిపల్ రాజకీయాల్లో అనుభవం ఉన్న మాజీ ఎమ్మెల్యే జోగారావు అవిశ్వాస తీర్మానం సినిమాలో కొంతవరకు విజయవంతమైనట్లు తెలుస్తోంది. పదిమంది కౌన్సిలర్లు టిడిపిలోకి వెళ్ళినా తిరిగి ఇద్దరిని వెనక్కి రప్పించడం, 14 మంది కౌన్సిలర్లతో క్యాంపు నిర్వహించడంలో ఆయన కృతకృత్యులయ్యారు. ఎమ్మెల్యే విజయచంద్ర అనుభవరాహిత్యాన్ని వైసిపి నాయకులు తమకు అనుకూలంగా మార్చుకున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి. గత కొద్దిరోజులుగా మాజీ ఎమ్మెల్యే జోగారావు కౌన్సిలర్లు చేజారిపోకుండా వారిని విహార యాత్రలకు పంపినట్లు తెలుస్తోంది.

సాలూరు, పార్వతీపురంలో బాబు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పిస్తున్న మంత్రి సంధ్యారాణి, ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీవాస్తవ

అణగారిన వర్గాల ఆశాజ్యోతి జగ్జీవన్ రామ్

జయంతి సభలో మంత్రి సంధ్యారాణి

ప్రజాశక్తి - సాలూరు/పార్వతీపురం

స్వాతంత్ర్య సమరయోధుడు, అణగారిన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ అని రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖా మంత్రి గుమ్మడి సంధ్యారాణి అన్నారు. డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ గారి జయంతి సందర్భంగా స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ జగ్జీవన్ రామ్ కేంద్ర ప్రభుత్వంలో కార్మిక, కమ్యూనికేషన్లు, రక్షణ మంత్రిత్వ శాఖలతో సహా ముఖ్యమైన పదవులను చేపట్టి, దేశంలో పలు మార్పులకు తీసుకొచ్చారని గుర్తుచేశారు. ఆయన నాయకత్వంలో దేశ విధానాలు, పాలనను రూపొందించడంలో కీలకపాత్ర పోషించారని అన్నారు. కేంద్ర వ్యవసాయ మంత్రిగా రెండుసార్లు చేపట్టి తన హరిత విప్లవానికి నాంధి పలికారని కితాబిచ్చారు. 1974లో ఏర్పడిన ఆహార సంక్షోభ సమయంలో ఆయన కీలక పాత్ర పోషించారన్నారు. దేశంలో ఎక్కువ కాలం పనిచేసిన కేబినెట్ మంత్రిగా ఆయన రికార్డు సృష్టించారని తెలిపారు. దళిత హక్కుల కోసమే కాదు, మానవతా కార్యక్రమాల్లోనూ ఆయన చురుగ్గా పాల్గొని, అందరినీ చైతన్యపరిచేవారని చెప్పారు. స్వాతంత్ర సమరయోధులను, పోరాట యోధులను మనం ఎప్పటికీ గుర్తు పెట్టుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మనందరం అటువంటి మహానుభావుల ఆశయాల దిశగా అడుగులు వేయాలని, వారి అడుగుజాడల్లో నడవాలని కోరారు.

పార్వతీపురం : డా. బాబు జగ్జీవన్ రామ్ 118వ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర, ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీవాస్తవతో పూలమాలను వేసి నివాళులు అర్పించారు. తొలుత కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో సాంఘిక సంక్షేమ శాఖ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని ఆయన చిత్ర పటానికి ఎమ్మెల్యే, పిఒ పూలమాలలను వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఒక సామాన్య రైతు కుటుంబంలో జన్మించిన బాబు జగ్జీవన్ రామ్ అణగారిన, అట్టడుగు వర్గాల కోసం పోరాడిన మహా వ్యక్తి అని ప్రసంశించారు. ఆయన స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ ముందడుగు వేయలని, ఆయన సేవలను మనమంతా గుర్తుంచుకోవాలని తరుణమిది అని అన్నారు. జగ్జీవన్ రామ్ సమానత్వం, అణగారిన వర్గాలకు సమాన హక్కుల కోసం పోరాడిన వ్యక్తిగా కొనియాడారు. అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం అవిశ్రాంతంగా కషి చేసిన మహెూన్నత వ్యక్తి అని ఆయన ప్రసంశించారు. పిఒ అశుతోష్ శ్రీవాస్తవ మాట్లాడుతూ సామాజిక న్యాయం రాజ్యాంగంలో ప్రాథమిక భాగంగా ఉండేలా జగ్జీవన్ రామ్ కృషి చేశారని కొనియాడారు. అంటరానివారికి సమానత్వం, హక్కుల కోసం నినదిస్తూ 1935లో ఆలిండియా డిప్రెస్డ్ క్లాసెస్ లీగ్‌ను స్థాపించడంలో ఆయన కీలక పాత్ర పోషించారని తెలిపారు. 50 ఏళ్ల పాటు నిరంతరాయంగా పార్లమెంటు సభ్యుడిగా ప్రపంచ రికార్డు సాధించారని అన్నారు. బాబూజీ అని పిలిపించుకున్న ఆయన నడిచిన బాట, అనుసరించిన ఆదర్శాలు, చూపిన సంస్కరణ మార్గాలను గుర్తుచేసుకుంటూ, ఆయన జీవితాన్ని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు.

కార్యక్రమంలో జిల్లా సాంఘిక సంక్షేమ శాఖాధికారి ఎమ్‌డి గయాజుద్దీన్, మున్సిపల్ కమిషనర్ సిహెచ్.వెంకటేశ్వర్లు, బలిజిపేట మండల ఎంఇఒ ఎస్.సింహాచలం, మాదిగ ఉద్యోగుల సమాఖ్య అధ్యక్షులు జి.గంగారాజు, ప్రెసిడెంట్ కె.సల్మాన్, సెక్రటరీ బి.రవికుమార్, రాష్ట్ర నాయకుడు పి. నారాయణరావు, మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు జి.ప్రభాకరరావు,సభ్యులు ఎన్.ప్రసాద్,ఆర్. వినయ్, కె.మౌన, ప్రజా ప్రతినిధులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సంధ్యారాణి

పండగలో ఇబ్బందుల్లేకుండా చూడాలి

మున్సిపల్ సిబ్బందికి మంత్రి సంధ్యారాణి సూచన

ప్రజాశక్తి - సాలూరురూరల్

పట్టణంలో మే 18, 19, 20 తేదీల్లో జరగనున్న శ్యామలాంబ అమ్మవారి పండగలో ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా మున్సిపాలిటీ పరిధిలో పనిచేసే ఉద్యోగులంతా సమన్వయంతో పని చేస్తూ కృషి చేయాలని రాష్ట్ర గిరిజనసంక్షేమశాఖా మంత్రి గుమ్మడి సంధ్యారాణి సూచించారు. శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్, సచివాలయ సిబ్బందితో శ్యామలాంబ పండుగను పురస్కరించుకుని సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పండుగ సందర్భంగా ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని, ముఖ్యంగా శుభ్రత, భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, ప్రజలకు తాగునీరు, మరుగుదొడ్లు సదుపాయాలు వంటి మౌలిక సదుపాయాలపై దృష్టి సారించాల్సిన అవసరముందని పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధిలో నీటి సమస్య తలెత్తకుండా దగ్గరుండి పర్యవేక్షించాలని, ఎక్కడైనా సమస్య ఉందని తన దృష్టికి తీసుకొస్తే తక్షణమే పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పట్టణ ప్రజలందరికీ చేరేలా చూడాల న్నారు. ప్రజలకు ప్రభుత్వం చేపట్టే కార్యక్రమాలపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత సచివాలయ సిబ్బందిపై ఉందన్నారు. ప్రతి ఒక్కరూ తమ విధులను బాధ్యతగా, నిష్పక్షపాతంగా, సమర్ధవంతంగా నిర్వహించాలని ఆమె స్పష్టం చేశారు. సమావేశంలో మున్సిపల్ కమిషన బివి ప్రసాద్, మున్సిపల్, పట్టణ సచివాలయ సిబ్బంది, కౌన్సిలర్లు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

కొత్తగా ఎన్నికైన ట్రెజరీ సర్వీస్ అసోసియేషన్ కార్యవర్గం

ట్రెజరీ సర్వీస్ అసోసియేషన్ జిల్లా కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - పార్వతీపురం

ఉమ్మడి విజయనగరం జిల్లా ట్రెజరీ డిపార్ట్మెంట్ ఎన్నికలు శనివారం విజయనగరంలో జరిగాయి. ఎపి ట్రెజరీ సర్వీస్ అసోసియేషన్ (ఎపిటిఎస్ఎ) జిల్లా ఎన్నికల్లో అధ్యక్షులుగా డి.నవీన్‌చంద్ , అసోసియేట్ ప్రెసిడెంట్‌గా పి.సురేష్ కుమార్, జిల్లా సెక్రటరీగా కెవిఎస్ఎస్ సింధూర, వైస్ ప్రెసిడెంట్లగా ఎస్.దివ్య భారతి, పి.సంతోష్ కుమార్, వై.కామినాయుడు, బివిఎస్ఎం నాయుడు, జాయింట్ సెక్రటరీలుగా వి.సరస్వతమ్మ, టి.అనిల్, ఎస్.రంజిత్ కుమార్, కోశాధికారిగా జి.ప్రశాంత్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యాక్రమానికి ఎన్నికల అధికారిగా పి.కిరణ్ కుమార్, అసిస్టెంట్ ఎలక్షన్ ఆఫీసర్‌గా ఎస్.భాస్కర్, పరిశీలకులుగా డి.రమణరెడ్డి వ్యవహరించారు.

కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పెన్షనర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు పెద్దింటి అప్పారావు, జి.నారాయణ, నాయుడు జగన్నాధం, కామరాజు, సత్యం నాయుడు, ఎపి ఎన్‌జిజిఒ జిల్లా, పట్టణ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు టి.శ్రీధర్ బాబు, ఆవు సురేష్, వై.ఆనంద్‌కుమార్, ఎ.కనకరాజు కోశాధికారి ఎస్‌వి సుధాకర్, అసోసియేట్ ప్రెసిడెంట్ జివిఆర్ఎస్ కిషోర్ కుమార్, ఎపిటిఎస్ఎ శ్రీకాకుళం జిల్లా, ఉమ్మడి విశాఖపట్నం జిల్లా, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా, పార్వతీపురం మన్యం జిల్లా, విజయనగరం జిల్లా నుండి కార్యక్రమానికి అధిక సంఖ్యలో ట్రెజరీ సిబ్బంది పాల్గొన్నారు.

శివరాంలో దారుణం

యువతిని కత్తితో పొడిచి పరారైన దుండగుడు

ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎస్‌పి వకుల్ జిందాల్

ప్రజాశక్తి-చీపురుపల్లి

గరివిడి మండలం శివరాం గ్రామంలో కోండ్రు అఖిల (18) అనే యువతిపై గుర్తు తెలియని వ్యక్తి కత్తితో దాడి చేసి పరారయ్యాడు. శనివారం మధ్యాహ్నం అఖిల తన ఇంట్లో ఉండగా మాస్కు ధరించిన ఓ వ్యక్తి వచ్చి ఆమెపై దాడికి పాల్పడ్డాడు. తనతో తెచ్చుకున్న కత్తితో కడుపులో పొడిచి పరారయ్యాడు. దీంతో తీవ్రంగా గాయపడిన ఆమె కేకలు వేయడంతో ఆమె నాన్నమ్మతో పాటు కుటుంబ సభ్యులు వెంటనే వచ్చి ఆమెను చీపురుపల్లి ఆసుపత్రికి, అక్కడ నుండి మెరుగైన చికిత్స కోసం విజయనగరం తిరుమల మెడికవర్ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న ఎస్‌పి వకుల్ జిందాల్, చీపురుపల్లి డిఎస్‌పి రాఘవులు, సిఐ కె.అశోక్‌కుమార్, అక్కడికి చేరుకొని పరిశీలించారు. క్లూస్‌టీమ్, డాగ్‌స్క్వాడ్ వచ్చి సంఘటనా స్థలాన్ని పరిశీలించాయి. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ కేసు మిస్టరీని త్వరలో ఛేదిస్తామని తెలిపారు. ఎస్‌పి వెంట రాజాం రూరల్‌సిఐ ఉపేంద్రరావు, ఎస్‌బిసిఐ ఎవి లీలారావు, తదితరులు ఉన్నారు. అయితే ఈ ఘటనకు గల కారణాలు బయటకు రాలేదు.

బాధితురాలిని పరామర్శిస్తున్న ఎంపి అప్పలనాయుడు, కిమిడి నాగార్జున

ప్రశాంతమైన పల్లెల్లోనూ మహిళలపై దాడులు వంటి విష సంస్కృతి రావడం బాధాకరమని విజయనగరం ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు, టిడిపి జిల్లా అధ్యక్షులు కిమిడి నాగార్జున అన్నారు. ఆస్పత్రిలో చికిత్సపొందుతున్న యువతిని పరామర్శించారు. ఆమె ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ నిందితుడికి కఠిన శిక్ష తప్పదని తెలిపారు. చట్టాలు ఎంత కఠినంగా అమలవుతున్నప్పటికీ.. ఇటువంటి ఘటనలు జరగడం దురదృష్టకరమన్నారు. బాధితురాలికి మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులను కోరారు.

బాధితురాలికి మెరుగైన వైద్యమందిచాలి : మంత్రి

ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితురాలు అఖిలకు మెరుగైన వైద్యం అందించాలని రాష్ట్రమంత్రి కొండపల్లి శ్రీనివాస్ వైద్యులకు ఒక ప్రకటనలో ఆదేశించారు. ప్రశాంతంగా ఉండే ఈ జిల్లాలో ఇలాంటి ఘటనలు జరగడం విచారకరమని అన్నారు. దోషులను కఠినంగా శిక్షిస్తామన్నారు.

ఐక్య పోరాటాలతోనే హక్కుల పరిరక్షణ

ఎపి గిరిజన సంఘ నాయకులు కృష్ణమూర్తి

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

గిరిజనులంతా ఐక్యంగా ఉండి పోరాడితేనే వారి హక్కులకు రక్షణ ఏర్పడడమే కాకుండా ఎటువంటి సమస్యనైనా పరిష్కరించుకోగలరని ఎపి గిరిజన సంఘం నాయకులు ఎం.కృష్ణమూర్తి అన్నారు. మండలం లోని వెలగవలస పంచాయతీ మొలగవలసలో శనివారం పరిసర గ్రామ ప్రాంత ప్రజలు ఏర్పాటు చేసుకున్న సిపిఎం సమావేశపు గదిని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాల వల్ల మొదట వేటు పడేది గిరిజనులపైనేనని అన్నారు. కార్పొరేట్ శక్తులకు ప్రభుత్వాలు దాసోహమై దేశ సంపదనంతా వారికి దోచిపెడుతున్నాయని, దేశంలోని ప్రభుత్వ రంగ సంస్థలే కాకుండా, గిరిజనులకు దక్కాల్సిన అడవులు, కొండలు, ఖనిజాలు కూడా వారికి ధారాదత్తం చేసి గిరిజనులను అడవుల నుంచి వేరు చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు. వీటిని ఎదుర్కోవాలంటే గిరిజనులు ఐక్యంగా ఉద్యమించా ల్సిన అవసరం ఉందన్నారు. తరచూ సమావేశాలు నిర్వహించుకునేందుకు ఇలాంటి స్థలాన్ని ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమని గ్రామస్తులను అభినందించారు. కార్యక్రమంలో గిరిజన, వ్యవసాయ కార్మిక, మహిళా సంఘాల నాయకులు కె.రామస్వామి, పి.రాము, పి.వరాలు, తాళంకి పాపమ్మ, మెల్లగ వద్దాయి, కుర్ర రాములమ్మ, వెలగరాజ వరలక్ష్మితో పాటుగా పరిసర 12 గ్రామాల నుంచి గిరిజనులు పాల్గొన్నారు.

కార్యాలయ ప్రారంభసభలో మాట్లాడుతున్న గిరిజన సంఘం నాయకులు కృష్ణమూర్తి

ఆక్రమణల నుంచి రికార్డుల ట్యాంపరింగ్ వరకు...

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఒకప్పుడు గ్రామాల్లో కుటుంబ బలం, బలగం అండచూసుకుని పొలాల్లో గట్టులు, పుట్టలు కలుపుకోవడం చూశాం. ఆ తరువాత ప్రభుత్వ భూములు ఆక్రమించుకోవడం, రాజకీయ అండదండలతో వాటిని వశపర్చుకోవడమూ కొత్తేమీ కాదు. తాజాగా అర్థబలంతో ఏకంగా రికార్డులు ట్యాంపరింగ్ జరిగిపోతోంది. కంచే చేనుమేసేసినట్టుగా సాక్షాత్తు రెవెన్యూ అధికారులే ఇందుకు పూర్తి సహాయ సహకారాలు అందిస్తున్నారన్న విమర్శలు సర్వత్రా వ్యక్తమౌతున్నాయి. ఇందులో విఆర్ఒలు మొదలుకుని మండలం, డివిజన్, జిల్లా స్థాయిలో ఎవరి పాత్రవారు పోషిస్తున్నారట. తాజాగా బయటపడ్డ వాస్తవాలే ఇందుకు తార్కాణంగా చెప్పుకోవచ్చు. భోగాపురం మండలంలో ఓ రిటైర్డు ఉద్యోగికి చెందిన భూమిని మరో ప్రభుత్వ అధికారి వశపర్చుకునేందుకు ప్రయత్నించారట. ఉద్యోగికి చెందిన కొంత భూమి అధికారి లేదా ఆయన కుటుంబీకులు, బినామీ పేరున కొంత వరకు ఆన్‌లైన్ డాక్యుమెంట్‌లో చేర్చారన్నది ఆయన అభియోగం. దీనిపై అధికార యంత్రాంగం నుంచి తగిన స్పందన లేకపోవడంతో ఏకంగా ముఖ్యమంత్రి, ప్రభుత్వంలో అత్యంత కీలకంగా వ్యవహరించిన విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు సంబంధించిన పిజిఆర్ఎస్ (ప్రజాసమస్యల పరిష్కారవేదిక)కు సుమారు 30సార్లు ఫిర్యాదు చేశారట. వీరి ఆదేశాల మేరకు కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ భోగాపురం మండలంలోని తూడెం గ్రామాన్ని సందర్శించారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయంలో రికార్డుల పరిశీలన చేస్తుండగా కౌలవాడ గ్రామానికి చెందిన భూ వివరాలకు సంబంధించి సర్వే నెంబర్ 128లోని వివరాలు ట్యాంపరింగ్ జరిగినట్టు గుర్తించారు. ఎఫ్‌సిఒ రికార్డుల్లో రెండు పేజీలను తొలగించి, ఆ స్థానంలో మరో రెండు పేజీలను అతికించినట్టుగా కూడా సాక్షాత్తు కలెక్టరే ప్రకటించారు. కొత్తగా అతికించిన పేజీల్లో డి.పట్టా జారీ చేసినట్టుగా కూడా ఉంది. వేరు శెనగ కోసం మట్టిని తవ్వితే లంకె బిందె తగిలిందన్నట్టుగా ఒక ఫిర్యాదు పరిష్కారానికి ఒక గంటపాటు మండలంలో పర్యటించిన కలెక్టర్‌కు ఏకంగా రికార్డు తారుమారుచేసిన విషయం బటయ పడింది. ఇది కేవలం మచ్చుకు మాత్రమే. ఇంకా లోతుల్లోకి వెళ్తే... భోగాపురం గ్రీన్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు భూ సేకరణ నేపథ్యంలో ఎకరా భూమి ఉన్నవారి పేరున 90 ఎకరాల వరకు రాసి, అలా వచ్చిన డబ్బును అధికారులు, రాజకీయ రాబందులు కాజేశారన్న చర్చ కొన్నాళ్లుగా బహిరంగంగానే నడుస్తోంది. వందలాది ఎకరాల ప్రభుత్వ భూములను ఇలా బినామీల పేర నమోదు చేసి ప్రభుత్వం నుంచి భారీగా మొత్తాన్ని వసూలు చేసుకునారనేది ఇప్పటికీ పబ్లిక్‌టాక్‌గా నడుస్తోంది. ఈ మండలంతో పాటు పూసపాటిరేగ, డెంకాడ మండలాల్లో గత ప్రభుత్వ హయాంలో 20ఏళ్లగా సాగులోవున్న అసైన్డ్ భూమిని దళితులకు రెగ్యులర్ చేసేందుకు తీసుకొచ్చిన ఆర్డినెన్స్‌ను ఉపయోగించుకుని రూ.కోట్ల విలువైన భూములను వశపర్చు కున్నారన్న చర్చ ఇప్పటికీ కొనసాగుతోంది. ఇందులో జిల్లా అధికారులు, రాజకీయ నాయకులతోపాటు ప్రభుత్వంలో అత్యంత కీలకంగా వ్యవహరించిన ఐఎఎస్ అధికారులు కూడా ఉన్నారని అప్పట్లో చర్చోపచర్చలు నడిచాయి. అంతకు ముందు ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురికాకుండా కాపాడలేకపోయారన్న అభియోగంతో భోగాపురం, కొత్తవలస సహా ఐదు మండలాల్లో పనిచేసిన తహశీల్దార్లకు నోటీసులు ఇచ్చారు. విచారణ కూడా చేపట్టారు. ఆ తరువాత ఏం జరిగిందో బహిర్గతం కాకుండా చర్యలు తీసుకున్నారు. ఒకానొక దశలో విజయనగరం జిల్లాలో భూ ఆక్రమణలు, రికార్డుల ట్యాంపరింగ్, అసైన్డ్ ల్యాండ్‌లో అక్రమాలు తదితరాలను తేల్చేందుకు గత ఏడాది ఆగస్టు 16న వచ్చిన రెవెన్యూ శాఖ ప్రత్యేక కార్యదర్శి ఆర్‌పి సిసోడియా కూడా భోగాపురం మండలంలోనే పరిశీలన చేశారు. అప్పట్లో ఏం గుర్తించారో? ఏమేరకు సరిచేశారో తమకేమీ తెలియదని ఆ ప్రాంతవాసులు చెప్పుకుంటున్నారు. కేవలం ఈ మండలాల్లో మాత్రమే కాదు. వేపాడ, మెంటాడ, ఎస్.కోట గిరిజన ప్రాంత ప్రభుత్వ, అసైన్డ్ భూములపై ఆర్థిక, రాజకీయ బలం ఉన్నవారు మోహరించారు. అధికారులు కూడా డబ్బులు ఇస్తే ఒకలాగా, లేదంటే మరోలాగా వ్యవహరిస్తున్నారనే చర్చనడుస్తోంది. బాడంగి మండలం లక్ష్మీపురం పంచాయతీ ఎరుకుల పాకులకు చెందిన గిరిజన మహిళ దాసరి యమున అదే మండలంలోని కామన్నవలస రెవెన్యూ గ్రామం పరిధిలో పెట్రోల్ బంకు పెట్టుకునేందుకు భూమి కొనుగోలు చేసుకుంది. ఇండియన్ ఆయిల్ కంపెనీ లిమిటెడ్‌తో ల్యాండ్ లీజు ఒప్పందం చేసుకునే క్రమంలో రెవెన్యూ శాఖతో ఎదురైన ఇబ్బందులను అధికారులు పరిష్కరించకపోవడంతో ఆమె ఇప్పటికీ ముందుకు సాగలేపోయారు. విజయనగరం రెవెన్యూ డివిజన్ బొండపల్లి మండలంలో రాజకీయ అండదండలు కలిగిన ఓ వ్యక్తి బంకు ఏర్పాటుకు మాత్రం ఆఘమేఘాలపై అనుమతులు ఇచ్చేశారు. వాస్తవానికి ఇక్కడి భూ వివాదం ఉండడం వల్ల గతంలో పనిచేసిన తహశీల్దార్, ఆర్డీవో తిరస్కరించారు. నాడు అసాధ్యమైంది. నేడు ఎలా సుసాధ్యం అయిపోయిందో రెవెన్యూ అధికారులు, వారిపై పర్యవేక్షిస్తున్న ఉన్నతాధికారులకే తెలియాలని స్థానికులు అంటున్నారు. రహదారులు, రైల్వే ట్రాకులు, సాగునీటి కాలువల పేరిట చేపట్టిన భూ సేకరణలోనూ అధికారులు ప్రభుత్వ కళ్లకు గంతలు కడుతున్నారనే విమర్శలు ఊపందుకున్నాయి. వ్యవసాయ భూములను నివాస స్థలాలుగా రికార్డుల్లో చూపించి ప్రభుత్వం నుంచి రెవెన్యూ అధికారులు భారీ మొత్తాలను రాబడుతున్నారని బహిరంగ చర్చనడుస్తోంది. ఇలా చెప్పుకుంటూ పోతే... జిల్లాలో రెవెన్యూ కార్యకలాపాల వెర్రి వెతలు వేస్తోంది. ఇదే పరిస్థితి కొనసాగితే భూములన్నీ పెద్దలు, రాజకీయ అండదండలు ఉన్నవారి చేతుల్లోకి వెళ్లిపోవడం ఖాయమనే చర్చ సర్వత్రా సాగుతోంది.

సమావేశంలో మాట్లాడుతున్న వైసిపి మైనార్టీ సెల్ అధ్యక్షులు షేక్ షఫీ

వక్ఫ్ సవరణ బిల్లుతో ముస్లిములకు తీరని అన్యాయం

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

ఎన్‌డిఎ కూటమి పార్లమెంట్లో చేసిన వక్ఫ్ సవరణ బిల్లుతో ముస్లిములకు తీరని అన్యాయమని మన్యం జిల్లా వైసిపి మైనారిటీ సెల్ అధ్యక్షులు షేక్ షఫీ అన్నారు. మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు క్యాంప్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల పార్లమెంట్లో మిత్రపక్ష ప్రభుత్వం తీసుకొచ్చిన వక్ఫ్ సవరణ బిల్లు ఆమోదం తెలపడంపై నిరసన తెలిపారు. ఈ బిల్లుపై తమ పోరాటం మున్ముముందు కొనసాగుతుందన్నారు. ఇప్పటికే సుప్రీంకోర్టుకు వక్ఫ్ సవరణ బిల్లు అంశాన్ని తీసుకెళ్లేందుకు పెద్దలు ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు సారధ్యంలో భవిష్యత్‌లో ఈ బిల్లుపై నియోజకవర్గ స్థాయిలో దశలవారీగా పోరాటం చేస్తామన్నారు. సమావేశంలో నియోజకవర్గ మైనార్టీ సెల్ అధ్యక్షులు ఎస్‌కె మహమ్మద్ జలాల్, ముస్లిం సోదరులు షేక్ ఇబ్రహీం, షేక్ బాబ్జాని, హబీబ్, పేరు, ఆజాన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

నియోజకవర్గ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారమే తమ తొలి ప్రాధాన్యత అని స్థానిక బోనెల విజయచంద్ర అన్నారు. శనివారం స్థానిక టిడిపి కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పాల్గొన్న ఆయన బలిజిపేట, సీతానగరం, పార్వతీపురం మండలాల నుంచి వచ్చిన వారి నుంచి సమస్యలు పరిష్కారం కోరుతూ దరఖాస్తులను స్వీకరించారు. సమస్యలను విన్న ఎమ్మెల్యే సంబంధిత శాఖల అధికారులతో ఫోన్లో మాట్లాడి సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాల్సిందిగా కోరారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

కిమ్మిలో వైద్య శిబిరం

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని కిమ్మిలో శనివారం స్థానిక వైద్యాధికారి బి.ప్రదీప్ కుమార్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జ్వరపీడితులు, గర్భిణీలు, చిన్నారులు, మధుమేహ, రక్తపోటు, తదితర రకాలైన రోగులకు ప్రత్యేక వైద్య తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి, ఎఎన్ఎం, ఆశా కార్యకర్తలు, 104 సిబ్బంది, రోగులు పాల్గొన్నారు.

రూ.49.12 లక్షలతో అభివృద్ధి పనులు

ప్రజాశక్తి - వీరఘట్టం

స్థానిక మేజర్ పంచాయతీ పరిధిలోని తెలగ, మర్రి, మందిరం, దళిత, రెల్లి, పెరుగు తదితర వీధుల్లో రూ 49.12 లక్షలతో అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు మేజర్ పంచాయతీ ఇఒ బి.కోటేశ్వరరావు శనివారం తెలిపారు. కాలువలు, సిసి రహదారులు, శ్మశాన వాటికలు, కల్వర్టులు తదితర 28 రకాలైన పనులు గుర్తించామన్నారు. సకాలంలో పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

సీతంపేటలో కురుస్తున్న వర్షం

సీతంపేటలో వర్షం

ప్రజాశక్తి - సీతంపేట

సీతంపేట ఏజెన్సీలో ఆదివారం సాయంత్రం వర్షం కురిసింది. దీంతో ప్రజలు కొంత ఉపశమనం మిగిల్చింది. ఇప్పటివరకు ఎండలు భగభగ మండడంతో ఉక్క పాత, మరోవైపు అధిక ఉష్ణోగ్రతలతో ప్రజలు అల్లాడిపోతున్నారు. గెడ్డల్లో నీరు లేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమయంలో కొద్దిపాటి వర్షం కురవడంతో కొంత ఉపశమనం కలిగింది.

పాలకొండ : పాలకొండలో శనివారం సాయంత్రం స్వల్ప వర్షం కురిసింది కొద్దిరోజులుగా ఎండలు వేడికి ఇబ్బందులు పడుతున్న ప్రజలకు ఈ వర్షం ఊరటం ఇచ్చింది. ఒకసారి చల్లదనం రావడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. మరి కాస్త వర్షం ఎక్కువ పడి ఉంటే బాగుండేదని పలువురు అభిప్రాయపడుతున్నారు.

ఘనంగా నూకాలమ్మ పండగ

ప్రజాశక్తి - కురుపాం

మండల కేంద్రంలో గల గౌడవీధి వారు నూకాలమ్మ తల్లి పండగలను తీసుకొచ్చారు. శనివారం సాయంత్రం ఘటాలను కురుపాంలో గల పలు వీధుల్లో డప్పు వాయిద్యాలు, మేళ తాళాలతో చిన్నారులు, పెద్దలు వివిధ రకాల పౌరాణిక వేషాలతో ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్దలు బాలంకి, తిరుపతి మాట్లాడుతూ తమ పూర్వీకుల నుంచి నూకాలమ్మ తల్లిని కొలుస్తున్నామని ప్రతి ఏటా ప్రత్యేక పూజలు మొక్కుకున్న మొక్కులను తీరుస్తుంటామని, తమకు ఆర్థిక సోమత కలిగినప్పుడు రెండు, మూడేళ్లకొకసారి పండగలను తెస్తుంటామని అన్నారు.

ఎస్‌డబ్ల్యూపిసిల పరిశీలన

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని సూరంపేట, పాపంవలస గ్రామాల్లో ఎస్‌డబ్ల్యుపిసిలను ఇఒపిఆర్‌డి కెకె కుమార్‌వర్మ శనివారం పరిశీలించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేకరించిన చెత్త ద్వారా ఆర్థిక వనరులను ఆ గ్రామాల అభివృద్ధికి ఉపయోగించుకోవాలన్నారు. హరిత రాయబారులకు ఎటువంటి ఇబ్బందుల్లేకుండా జీతాలు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శులు పి.మురళీకృష్ణ, ఇ.పైడిరాజు, సర్పంచు గౌరునాయుడు తదితరులు పాల్గొన్నారు

శరవేగంగా పారిశుధ్య పనులు

ప్రజాశక్తి - కురుపాం

స్థానిక మేజర్ పంచాయతీ కురుపాంలో శనివారం ఉపసర్పంచ్ షేక్ ఆదిల్, పంచాయతీ ఇఒ వై.వెంకట నాయుడు పారిశుధ్య పనులను ముమ్మరంగా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శుక్రవారం రాత్రి కురిసిన వర్షానికి పలు వీధుల్లో గల కాలువల్లో చెత్తాచెదారంతో నిండిపోయి ఉండడంతో మురుగు వాసనతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రజలు వ్యాధులు బారిన పడకుండా ఉండేందుకు ముందస్తు జాగ్రత్తలు చర్యల్లో భాగంగా గౌడువీధి, శోభలతదేవి కాలనీ, ప్రధాన రహదారి వద్ద గల ఇరువైపులా కాలువల్లో నిండి ఉన్న చెత్తాచెదారాన్ని తొలగించి ప్రజలకు మురుగు వాసన నుంచి విముక్తి కలిగించామని అన్నారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు వారికి ధన్యవాదాలు తెలిపారు.

కాలువల్లో పూడికలు తీయిస్తున్న పంచాయతీ ఉపసర్పంచ్, ఇఒ

ఘనంగా జగ్జీవన్‌రామ్ జయంతి

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

బాబుజీగా ప్రసిద్ధి చెందిన జగ్జీవన్ రామ్ 118వ జయంతి వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో భాగంగా స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి ఎస్పీ ఎస్‌వి మాధవ్‌రెడ్డి, పోలీస్ అధికారులు, సిబ్బంది పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగ్జీవన్‌రామ్ మహోన్నత నాయకత్వం, వ్యక్తిత్వం, సేవలు భారతదేశ ప్రజాస్వామిక వ్యవస్థకు, సంస్థలకు మహాబలాన్ని చేకూర్చిపెట్టాయని అన్నారు. భారత రిపబ్లిక్ తొలి లోక్‌సభలో ప్రవేశించిన జగ్జీవన్‌రామ్ వరుసగా ఎనిమిదిసార్లు గెలిచి 33 ఏళ్ల కేంద్రమంత్రిగా, దేశ ఉప ప్రధానిగా దేశంలో ప్రజారాజ్య నిర్మాణానికి నిరంతరం కృషి చేశారనికొనియాడారు.

కృష్ణపల్లిలో....

మండలంలోని కృష్ణపల్లిలో మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు ఆ గ్రామంలో ఉన్న జగ్జీవన్‌రామ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అణగారిన సమూహాల మహానాయకుడు డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ అని, ఆయన చూపిన బాటలో మనమంతా ముందుకు సాగాలని పిలుపు ఇచ్చారు.

సీతానగరం : మండలంలోని లచ్చయ్యపేట వద్ద డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహాన్ని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర ఆవిష్కరించారు. అనంతరం బాబు జగ్జీవన్ రామ్ విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బాబు జగ్జీవన్ రామ్ అమలు చేసిన చట్టాలు నేటికీ స్థిరంగా నిలిచాయన్నారు. వ్యవసాయ శాఖ మంత్రిగా పనిచేసిన సమయంలో ఎన్నో సంస్కరణ తీసుకొచ్చి దేశ అభివృద్ధికి కృషి చేశారన్నారు. ఈయన చరిత్ర ప్రతి భారతీయుడు చదవాలని, ఆయన పేరిట ప్రత్యేక పుస్తకాన్ని ప్రభుత్వం ముద్రించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని అన్నారు. ఈ విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తాను తీసుకువెళ్తామన్నారు.



వీరఘట్టంలో నివాళ్లు అర్పిస్తున్న కాలనీవాసులు



సీతానగరం : జగ్జీవన్‌రామ్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే విజయ చంద్ర

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పేరిట ఎన్నో పుస్తకాలు, వీడియాలు, సినిమాలు తీసిన ప్రభుత్వాలు బాబు జగజ్జీవన్‌రావు గురించి ఈ తరహా పుస్తకాలు, వీడియోలు, సినిమాలు తీయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

సీతంపేట : సంఘ సంస్కర్త, సామాజిక న్యాయ ఉద్యమ సారథి, తన పాలనా దక్షతతో అఖండ భారతావనికి విశేష సేవలందించిన భారత మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా స్థానిక టిడిపి కార్యాలయంలో ఆయన చిత్రపటానికి నాయకులు పూలమాల వేసి ఘన నివాళి. అర్పించారు. ఈ సందర్భంగా టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పడాల భూదేవి మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం, సామాజిక సమానత్వం కోసం పోరాడిన ఆదర్శ నేత డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ అని, దేశానికి ఆయన చేసిన సేవలు నిరుపమానమని కొనియాడారు. దళితుల అభ్యున్నతికి డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ ఎనలేని కృషి చేశారన్నారు. ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు మురళీమోహన్, మాజీ ఎంపిపి కుంపి తదితరులు పాల్గొన్నారు.

ఐటిడిఎలో...

స్థానిక ఐటిడిఎలో బాబూ జగజీవన్ జయంతి వేడుకలు నిర్వహించారు. డిడి అన్నదొర చిత్రపటానికి పూలమాలవేసి నివాళ్లు అర్పించారు. ఆయన అడుగుజాడల్లో యువత ముందుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో ట్రైబల్ వెల్ఫేర్ ఇఇ రమాదేవి, అకౌంట్ మేనేజర్ ఎఒ సునీల్, ఐటిడిఎ సిబ్బంది పాల్గొన్నారు.

వీరఘట్టం : మండల కేంద్రంలోని బాబు జగజీవన్ రామ్ కాలనీలో శనివారం భారతదేశ మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబు జగజీవన్‌రామ్ జయంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి కాలనీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో దళిత నాయకులు ఎ.రామ్‌కుమార్, గవరయ్య, బి.వెంకటి, అసిరయ్య, ఎన్ సుందరరావు, రాములు, దాసు, రాము, ఎస్ శశిభూషణరావు, కె.పైడిరాజు, బి.పైడయ్య, ఎన్.కళ్యాణ్, తదితరులు పాల్గొన్నారు.

సీతంపేట : ఐటిడిఎలో జగ్జీవన్‌రామ్‌కు నివాళ్లు అర్పిస్తున్న అధికారులు

పాలకొండ : అట్టడుగు వర్గాల హక్కుల కోసం, సమాజంలో వారికి తగిన గుర్తింపు కోసం తన జీవితాన్ని త్యాగం చేసి కృషి చేసిన మహోన్నత వ్యక్తి డాక్టర్ బాబు జగజ్జీవన్ రామ్ అని మాదిగ ఉద్యోగుల సమాఖ్య రాష్ట్ర నాయకులు అలజంగి చిన్నారావు అన్నారు. డాక్టర్ బాబు జగజ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో గల ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాదిగ ఉద్యోగుల సమైక్య సీనియర్ నాయకులు ఎమ్మల సతీష్ మాట్లాడుతూ ఎవరికీ సాధ్యపడనంతగా స్వాతంత్ర్యము అనంతరం 50ఏళ్ల పార్లమెంటేరియన్‌గా 33 సంవత్సరాలు కేంద్రమంత్రిగా, ఉప ప్రధానిగా బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి, సమాజంలో విప్లవాత్మకమైన మార్పుల కోసం తన జీవితాన్నే త్యాగం చేసిన మహోన్నతి వ్యక్తిని కొనియాడారు. కార్యక్రమంలో స్థానిక మాదిగ సంక్షేమ సంఘ అధ్యక్షులు లోపింటి జడ్డియ్య రెండో వార్డ్ కౌన్సిలర్ ప్రతినిధి ఆకుల కుమార్, ఉద్యోగుల సమైక్య గౌరవ సలహాదారులు గుత్తావిల్లి లాజరన్, సీనియర్ దళిత నాయకులు సబ్బ నాని బాబు, మాదిగ ఉద్యోగుల సమైక్య నాయకులు కొరటాని రవి, భోగి విశ్వేశ్వరరావు, సార్తి మహేశ్వర రావు, ఎందవ రాజు తదితరులు పాల్గొన్నారు

జగ్జీవన్‌రామ్‌కు నివాళ్లు అర్పిస్తున్న పాలకొండ నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి భూదేవి

ఫీల్డ్ అసిస్టెంట్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి

ప్రజాశక్తి - కురుపాం

గ్రామీణ ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లకు ఉద్యోగ భద్రత కల్పించి, కనీస వేతనాలు అమలు చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి వై.మన్మధరావు, కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ జెఎసి జిల్లా కన్వీనర్ బివి రమణ డిమాండ్ చేశారు. కురుపాం, జియ్యమ్మ వలస, గుమ్మలక్ష్మీపురం మండలాల ఫీల్డ్ అసిస్టెంట్ల సదస్సు కురుపాంలో శనివారం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 20 ఏళ్లుగా గ్రామీణ పేదలకు ఎంతో సేవలందిస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లకు నేటికీ ఉద్యోగ భద్రత కల్పించకపోవడం విచారకరమని, అతి తక్కువ వేతనంతో ఫీల్డ్ అసిస్టెంట్లు జీవనం సాగిస్తున్నారని, రోజురోజుకు ప్రభుత్వం ఫీల్డ్ అసిస్టెంట్లపై పని భారాన్ని మోపుతూ, ఇటీవల రాజకీయ వేధింపులు పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. రాజకీయ కారణాలతో 8మంది ఫీల్డ్ అసిస్టెంట్లను జిల్లాలో తొలగించారని అన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్ల వ్యవస్థను కించపరిచేలా అధికార పార్టీ నాయకులు, కొంతమంది అధికారులు నిందించడం కూడా సరైంది కాదన్నారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు అత్యంత ముఖ్యమైన గ్రామీణ ఉపాధి హామీ చట్టంలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యలు పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు చేపట్టాలని, లేనిచో వారిని ఐక్యం చేసి ఉద్యమిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం జిల్లా అధ్యక్షులు మండంగి హరినాథ్, ఉపాధ్యక్షులు కొండ గౌరి శంకరరావు, ప్రసాదరావు, నాయకులు రామారావు, సింహాచలం, మోహన్ దాస్, ఆదినారాయణ, గంగ, రవణమ్మ మూడు మండలాల ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పాలకొండలో జరిగిన ఫీల్డ్ అసిస్టెంట్ సమావేశంలో మాట్లాడుతున్న మన్మధరావు

పాలకొండ : ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఆ సంఘం నాయకులు ప్రసాద్ అన్నారు. స్థానిక ఆంజనేయ గుడి ఆవరణలో ప్రసాద్ అధ్యక్షతన ఫీల్డ్ అసిస్టెంట్ల నియోజకవర్గ సదస్సు శనివారం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మధరావు. యూనియన్ అధ్యక్షులు మండింగ హరినాథ్ మాట్లాడుతూ ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ భద్రత కల్పించాలని, పిఎఫ్, ఇఎస్‌ఐ, ఇన్సూరెన్స్ వంటి సౌకర్యాలు కల్పించాలి అన్నారు.ఈ సదస్సులో సిఐటియు మండల నాయకులు కాద రాము, సాయి తేజ, రాంప్రసాద్, రాంబాబు నాలుగు మండలాల ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

స్టిక్కర్లను విడుదల చేస్తున్న సిపిఎం నాయకులు

స్మార్ట్ మీటర్లను వెంటనే నిలిపివేయాలి : సిపిఎం

ప్రజాశక్తి - సాలూరురూరల్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాష్ట్రంలో విద్యుత్ స్మార్ట్ మీటర్లు ఇంటింటికీ అమర్చి ప్రజల సొమ్మును అదానీకి దోచు పెట్టాలని చూస్తుందని ఈ నిర్ణయాన్ని వెంటనే విరమించుకోవాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. సిపిఎం ఆధ్వర్యంలో స్మార్ట్ మీటర్లు మాకొద్దు.... విద్యుత్ బారాలు తగ్గించాలి అంటూ ముద్రించిన స్టిక్కర్లను పట్టణ నాయకులు శనివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు టి.శంకర్, రాముడు మాట్లాడుతూ విద్యుత్ రంగాన్ని ఇప్పటి కూటమి ప్రభుత్వం, గత వైసిపి ప్రభుత్వం కేంద్రంలోని బిజెపితో కలిసి అదానీ లాభాలే లక్ష్యంగా పనిచేస్తున్నాయని విమర్శించారు. నేడు అదే విధానాలు అమలు చేస్తూ స్మార్ట్ మీటర్లు ఇంటింటికి అమర్చి ప్రజలను దోపిడీ చేయాలని చూస్తున్నారని విమర్శించారు. రూ.17వేల కోట్లు సర్దుబాటు చార్జీల పేరుతో ఇప్పటికే భారాలు వేసి ప్రజల నడ్డి విరిచారని, ఇప్పుడు అలాగే మీటర్లు ప్రజల మెడకు తగిలించి మరో దోపిడీకి సిద్ధపడుతున్నారని, ప్రజలంతా దీన్ని వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. కార్పొరేట్ కంపెనీ అధిపతులు లాభాల కోసం మాత్రమే బిజెపి, దాని మిత్రులు పనిచేస్తున్నాయని, ఓట్లు వేసిన ప్రజల కోసం ఏమీ చేయడం లేదని విమర్శించారు. ఎన్నికల ముందు చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ ప్రజలకు ఏ కష్టాలు రాకుండా, ధరలు పెంచకుండా సేవ చేస్తామని, భారాలు వేయమని నమ్మబలికి నేడు అధికారం ఇచ్చాక ప్రజల నడ్డి వీరిచే కార్యక్రమాలు చేపడుతున్నారని అన్నారు. వీటికి ప్రజలంతా కలిసి పోరాటాలకు సిద్ధపడాలని, ప్రభుత్వాలు ప్రజలకు నష్టం చేసే ఏ నిర్ణయం తీసుకున్నా సిపిఎం ముందుండి పోరాడుతుందని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఈశ్వరరావు, పోలరాజు, శ్రీను, రవి పాల్గొన్నారు.

ఘనంగా గాయత్రి స్కూల్ స్నాతకోత్సవ వేడుకలు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

స్థానిక లయన్స్ కల్యాణ మండపంలో గాయత్రి స్కూల్ స్నాతకోత్సవ వేడుకలు స్కూల్ వ్యవస్థాపకులు పివికె మణికుమార్ ఆధ్వర్యంలో ప్రిన్సిపల్ టి.ఫణిబాబు పర్యవేక్షణలో శనివారం ఘనంగా జరిగాయి. స్కూల్ ప్రైమరీ విద్యార్థిని, విద్యార్థులు, తల్లిదండ్రులు ఈ వేడుకలకు హాజరయ్యారు. ఈ వేడుకలుకు ప్రముఖ దంతవైద్య నిపుణులు డాక్టర్ పిఎ దివ్య, వాసవి, గాయిత్రి విద్యా సంస్థల చైర్మన్ పి.సరిత ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ స్నాతకోత్సవ వేడుకల్లో విద్యార్థిని విద్యార్థులు చేసిన అనేక సాంస్కృతిక కార్యక్రమాలు పలువుర్ని ఆకట్టుకున్నాయి. విద్యార్థులు చేసిన కరాటే విన్యాసాలు అలరించాయి. అనంతరం ప్రిన్సిపల్ ఫణిబాబు మాట్లాడుతూ, పాఠశాలలో నిరంతరం నిర్వహించే బోధన, బోధనేతర విషయాలు గురించి విద్యార్థులు తల్లిదండ్రులకు వివరించారు. సిసిఇ పద్ధతికి అనుకూలమైన విద్యార్థి కేంద్రీకృత బోధనా, పద్ధతుల ద్వారా తమ పాఠశాలలో పాఠ్యాంశాలు బోధిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమం అనంతరం పాఠశాలలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థిని, విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థికి ధ్రువపత్రాన్ని అందజేస్తున్న ప్రిన్సిపల్ మణిబాబు

ఉపాధి పనుల తనిఖీ

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని కొత్తవలసలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఎంపిడిఒ పి.త్రివిక్రమరావు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాబ్‌కార్డు ఉన్న ప్రతి వేతనదారునికి పని కల్పించాలన్నారు. వడదెబ్బకు గురికాకుండా ఉండేందుకు ఉదయం 6 నుంచి 10గంటల వరకు, మధ్యాహ్నం పూట పని చేయాలన్నారు పని ప్రదేశాల్లో మంచినీరు సౌకర్యం కల్పించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు

ప్రకృతి సేద్యానికి తొలిమెట్టు నవధాన్యాలు

ప్రజాశక్తి - పాచిపెంట

ప్రకృతి సేద్యం చేయాలనుకున్న, భూమిని కాపాడుకోవాలనుకున్న రైతులు తప్పనిసరిగా పిఎండిఎస్ నవధాన్యాలు చల్లుకోవాలని మండల వ్యవసాయ అధికారి కె.తిరుపతిరావు అన్నారు. మండలంలోని తాడూరులో సిఆర్పి తిరుపతినాయుడు ఆధ్వర్యంలో ఇంటింటికి నవధాన్యాలు కార్యక్రమంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రకృతి సేద్యానికి తొలిమెట్టు నవధాన్యాలు అన్న నినాదాలతో రైతులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం తిరుపతిరావు మాట్లాడుతూ మండలంలో రైతులు మొక్కజొన్న ఏక పంట విధానాన్ని పాటించడం వల్ల కనీసం ఒక్క శాతం ఉండాల్సిన సేంద్రీయ పదార్థం 0.01 శాతం మాత్రమే ఉందన్నారు. మట్టి నమూనా పరీక్షల విశ్లేషణ ఫలితాల్లో ఈ విషయం వెల్లడైందని అన్నారు. భూమిలో సేంద్రీయ పదార్థం లేనప్పుడు ఎన్ని రసాయన ఎరువులు వాడినా క్రమేపీ దిగుబడులు తగ్గుముఖం పడుతూనే ఉంటాయని, క్రమంగా భూమి వ్యవసాయానికి పనికి రాకుండా పోతుందని తెలిపారు. రసాయన ఎరువులైన కాంప్లెక్స్, పొటాష్ ఎరువులకు సంబంధించిన గనులు త్వరలో అంతరించిపోతాయని, కావున రైతులు పీఎండీఎస్ నవధాన్యాలతో తమ నేలను రక్షించుకోవాలని కోరారు. అనంతరం ఇంటింటికి వెళ్లి రైతులకు నవధాన్యాల ప్రాముఖ్యతను వివరించారు. నవధాన్యాల సాగు వల్ల పంటకు కావాల్సిన పోషకాలు అందుతాయని, నీటి నిల్వ సామర్థ్యం పెరుగుతుందని అన్నారు. సారవంతమైన మట్టిని ఎండ వాన గాలుల నుంచి రక్షిస్తుందని, నేలలో జీవ వైవిధ్యం పెంచుతుందని, మిత్ర పురుగుల వృద్ధి జరుగుతుందని, పంటలో కలుపు సమస్య, చీడపీడల ఉధృతి తగ్గుతుందని తెలిపారు. పశు పోషణ వృద్ధి పాల వృద్ధి జరుగుతుందని, పంటకు కావాల్సిన సూక్ష్మ, స్థూల పోషకాల లభ్యత పెరుగుతుందని తెలిపారు. అనంతరం రైతు డి.రాములుతో 200 కేజీల ఘన జీవామృతం తయారు చేయించారు. కార్యక్రమంలో ఐసిఆర్‌పి లు నారాయణరావు, శివశంకర్, విఎఎలు ఈదుబిల్లి శ్రీను, రైతులు పాల్గొన్నారు.

పాచిపెంటలో ర్యాలీ నిర్వహిస్తున్న రైతులు, వ్యవసాయశాఖ సిబ్బంది

నాణ్యమైన ఘనజీవామృతం నేలకు జీవం

కురుపాం : నాణ్యమైన ఘనజీవ అమృతం నేల తల్లికి జీవమని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సన్నిదొర అన్నారు. మండలంలోని వలసబల్లేరులో శనివారం మహిళా సంఘాల సభ్యులకు, రైతులకు ఘన జీమామృతం తయారు చేయు విధానంపై అవగాహన కల్పించి వ్యవసాయంలో వాడే పద్ధతులపై అవగాహన కల్పించారు. ఘనజీవ అమృతం వాడాలని అది నేల తల్లికి సారవంతంగా తయారవ్వడానికి ఎంతగానో దోహదపడుతుందని అన్నారు. అలాగే పంటలు బాగా పండుతాయన్నారు. యూరియా కూడా ఉపయోగించాల్సిన అవసరం లేదని సూచించారు.

ఆటో బోల్తాపడి ఒకరు మృతి

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలో ఇసక గెడ్డ సమీపంలో ఆటో బోల్తా పడిన సంఘటనలో గొట్టాపు లక్ష్మణరావు (37 మృతి చెందాడు. శనివారం జరిగిన ఈ సంఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సీతంపేట నుండి పాలకొండ వైపు ఆటో వెళ్తుండగా ఇసకగెడ్డ సమీపాన ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఆటోలో నలుగురు ప్రయాణిస్తున్నారు. అందులో లక్ష్మణరావు తలకు బలమైన గాయవ్వడంతో పాలకొండ ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందు మృతి చెందారు. లక్ష్మణరావుది పాలకొండ మండలం వెలగవాడ. ఆయనకు భార్య మేరీ, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. సంఘటనపై ఎస్సై వై అమ్మనరావు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు

20 లీటర్ల నాటు సారా స్వాధీనం

ప్రజాశక్తి - కురుపాం

జియ్యమ్మవలస మండలం, చినమేరంగిలో ఎక్సైజ్ అధికారులు నిర్వహించిన దాడుల్లో అక్రమంగా నాటు సారా కలిగియున్న రాగోలు అప్పల స్వామిని అదుపు లోనికి తీసుకొని 20 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్టు ఎన్‌ఫోర్సమెంట్ సిఐ ఎస్.సింహాద్రి తెలిపారు. తదుపరి విచారణ నిమిత్తం కేసులను ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్‌కు తరలించినట్టు తెలిపారు. ఈ దాడుల్లో ఎస్ఐ రాజశ్రీ, కానిస్టేబుళ్లు బి.రాము, ఎల్.జనార్ధన రావు పాల్గొన్నారు.

60 నాటు సారా పాకెట్లు పట్టివేత

ఎన్ఫోర్స్మెంట్ సిఐ ఇందిరా దేవి, సిబ్బంది స్థానిక ఇందిరా కాలనీలో చేపట్టి దాడుల్లో ఎం.క్రాంతికుమార్ నుంచి 60 నాటు సారా పాకెట్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. తదుపరి విచారణ కేసును ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ పార్వతీపురానికి బదిలీ చేశామన్నారు. ఈ దాడుల్లో హెచ్ సి రాంబాబు, ఇసి విఎం నాయుడు, మనోజ్ పాల్గున్నారు.

నల్ల బెల్లం విక్రయించితే చర్యలు

సీతంపేట : నాటు సారా తయారీకి నల్ల బెల్లం విక్రయిస్తే చర్యలు తప్పవని ఎక్సైజ్ సీఐ సూర్యకుమారి హెచ్చరించారు. శనివారం బెల్లం విక్రయించిన వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాటు సారా తయారీకి నల్ల బెల్లం విక్రయించిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నాటు సారా తయారీకి మూడు సరుకు విక్రయించి సహకరిస్తే కేసులు తప్పవని హెచ్చరించారు. సారా నిర్మూలనకు అందరూ సహకరించాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది, మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.